సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



ఉచిత ప్రయాణం ఉత్తిదేనా..!
కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు నోచుకోలేదు. - 8లో



రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి - 8లో
రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతిని అర్చకులు వైభవంగా జరిపారు.



ప్రజా ప్రయోజన పనులు గుర్తించండి
ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు గుర్తించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

జిల్లాలో 95.09 శాతం పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లాలో తొలిరోజైన శనివారం 95.09 శాతం పూర్తయింది. కలెక్టర్ ఎస్.శ్యామ్‌ప్రసాద్, డీఆర్‌డీఏ అధికారుల పర్యవేక్షణలో సచివాలయాల సిబ్బంది పింఛన్ల పంపిణీని ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించారు. కలెక్టర్ పార్వతీపురం పట్టణం ఇందిరా కాలనీలో పలువురికి పింఛన్లు అందజేశారు. జిల్లాలో 1,42,866 మంది లబ్ధిదారులు ఉండగా, రూ.59.37 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. శనివారం సాయంత్రం 8 గంటల సమయానికి డీఆర్‌డీఏ అధికారుల నివేదిక ప్రకారం జిల్లాలో 1,35,856మందికి (95.09 శాతం) రూ.56.40 కోట్లు అందజేశారు.

ఇదెక్కడి అన్యాయం..!



ఎంపీడీఓ పంపించిన నోటీసులు చూపుతున్న పింఛన్‌దారులు

గరుగుబిల్లి: చిత్రంలో కనిపిస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులది గరుగుబిల్లి మండలంలోని బురద వెంకటాపురం. వీరు సుమారు దశాబ్ద కాలంగా సామాజిక పింఛన్లు అందుకుంటున్నారు. ఇప్పుడు వీరి అర్హత నిరూపించుకోవాలంటూ ఎంపీడీఓ నోటీసులు పంపించడంతో ఆందోళన చెందుతున్నారు. ఇదెక్కడి అన్యాయమని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అవ్వాతాతలపై రాజకీయ వివక్ష చూపుతోందని మండిపడుతున్నారు. బురదవెంకటాపురానికి చెందిన 34 మంది, దళాయివలసకు చెందిన 10 మంది ఎంపీడీఓ జారీచేసిన నోటీసులు చూపిస్తూ తమ గోడువినిపించారు. ఇదే విషయాన్ని ఎంపీడీఓ జి.పైడితల్లి వద్ద ప్రస్తావించగా కలెక్టర్ ఆదేశాల మేరకు పింఛన్‌దారులకు సంబంధించి అర్హతలను విచారణ చేపడుతున్నామని, ఎవరినీ తొలగించే ఉద్దేశం లేదన్నారు. అనర్హత ఉంటే పింఛన్లను నిలుపుదల చేస్తామని చెప్పారు.

ఏనుగుల రిజర్వ్‌జోన్ ఏర్పాటు అత్యవసరం

- అరకు ఎంపీ గుమ్మా తనూజారాణి



పార్వతీపురంటౌన్: జిల్లాలోని పలు మండలాల్లో మానవ, జంతు ఘర్షణలు జరుగుతున్నందున పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రత్యేకంగా ఏనుగుల రిజర్వ్ జోన్ ఏర్పాటు చేయాలని అరకు ఎంపీ గుమ్మా తనూజారాణి శనివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏనుగుల సంచారానికి శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో గత దశాబ్దకాలంలో సుమారు 20 మందికి పైగా మరణించారన్నారు. అస్సాం, బెంగాల్, ఒడిశా తదితర రాష్ట్రాలవలే ఇక్కడ కూడా ఏనుగులకు ప్రత్యేక రిజర్వ్‌జోన్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. అరకు పార్లమెంటరీ నియోజకవర్గంలో భాగమైన కురుపాం, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల ప్రజలకు ఏనుగుల సమస్య నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఏనుగులు ధ్వంసం చేసిన పంట నష్టం అంచనాలను త్వరితగతిన పూర్తిచేసి రైతులకు పరిహారం చెల్లించేలా రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు చొరవచూపాలన్నారు. నిత్యం వందలాది ఎకరాల్లో అరటి, చెరకు పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తుండడంతో పంటలను సాగుచేసేందుకు రైతులు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

ప్రజల మదిలో సజీవ చిత్రం వైఎస్సార్

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వెనుకబడిన ఉమ్మడి విజయనగరం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు విశేష కృషి చేసిన ముఖ్యమంత్రుల్లో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డిని మించినవారు లేరని, ప్రజల మదిలో సజీవ చిత్రంగా ఉండిపోయారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలో జేఎన్‌టీయూ ఏర్పాటుచేసి పేద కుటుంబాల విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యను చేరువచేశారన్నారు. తోటపల్లి, జంఝావతి, పెద్దగెడ్డ తదితర ప్రాజెక్టులు ఇప్పుడు రైతులకు భరోసా ఇస్తున్నాయంటే వాటివెనుక వైఎస్సార్ విజన్ ఉందని తెలిపారు. ఈనెల 2వ తేదీన వైఎస్సార్ వర్ధంతిని ఊరూరా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సండే స్పెషల్

కొండకోనల్లో.. కొంగొత్త అందాలు

- ఆకర్షిస్తున్న మన్యం జలపాతాలు
- పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్న ఏజెన్సీ అందాలు
- జలపాతాల నీటిని ఒడిసిపడుతూ పంటలు సాగుచేస్తున్న గిరిజన రైతులు

కనుచూపు మేర కనిపించే పచ్చని కొండలు.. వాటిని తాకుతూ ముందుకు సాగేలా కనిపించే మబ్బులు.. ఎత్తైన కొండల మధ్య నుంచి అక్కడక్కడ జాలువారే నీటి సవ్వడి.. ఆ నీటితో కొండవాలులో సాగయ్యే పంటలు.. ఏజెన్సీకి వెళ్లేవారికి కనువిందు కలిగిస్తున్నాయి. ఓ వైపు జలపాతాల నీటిసవ్వడి పర్యాటకులను మురిపిస్తుండగా.. ఇక్కడి గిరిజనుల సాగు పద్ధతులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వర్షాలు కురిసేవేళ మన్యం కొంగొత్త అందాలను పంచుతోంది. జలజలా పారుతున్న జలపాతాలు పర్యాటకులను రారమ్మంటున్నాయి.

– సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు రూరల్/పాచిపెంట/గుమ్మలక్ష్మీపురం/సీతంపేట



కొండకోనల్లో పుట్టి..

గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో మొగనాలి గెడ్డ జలపాతం ఉంది. ఈ జలపాతం వద్ద ఐటీడీఏ పార్వతీపురం అధికారులు విశ్రాంతి భవనం, పర్యాటకుల కోసం హట్‌లను నిర్మించారు. రహదారి నుంచి జలపాతం వెళ్లేందుకు మెట్లు ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో మినహాయించి.. నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో పర్యాటకులు అధికంగా వస్తుంటారు. అడ్డంగి జంగిడిభద్ర, చాపరాయి జంగిడిభద్ర పరిసర ప్రాంతాల నుంచి పుట్టుకొచ్చిన నీరు.. నిత్యం ఈ జలపాతం మీదుగా కిందకు వెళ్తుంటుంది. ఇదే నీరు సుమారు 60 ఎకరాల భూమికి నేరుగా సాగునీటి అవసరాలను తీరుస్తోంది. సమీప గెడ్డ చెలమల నీరు కూడా అక్కడక్కడ కలిసి ఎగువ తాడికొండ, తాడికొండ, మంగళాపురం, పెదఖర్జ గ్రామాలకు చెందిన సుమారు 250 ఎకరాల్లోని పంటలకు సాగునీరు అందిస్తోంది.



గాలిగబడారు జలపాతం

ఒడిశాకు సరిహద్దులో..


సాలూరు నుంచి 19 కిలోమీటర్ల దూరంలో మామిడిపల్లి దాటి దండిగాం, కురుకూటి జలపాతాలు వస్తాయి. సాలూరు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో పాచిపెంట మండలం పంచాది గురువునాయుడుపేట దాటి పూడి /నీలంవలస వెళ్లే దారిలో 40 అడుగుల ఎత్తున నీలం వాటర్ ఫాల్స్ సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. శిఖపరువు, ఆలూరు వంటి జలపాతాలూ చూడదగినవే. ఒడిశాకు సమీపంలో గాలిగబడారు జలపాతం కూడా ఆకట్టుకుంటోంది.

సీతంపేట మండలంలోని మెట్టుగూడ జలపాతం



సీతంపేటలో జల సవ్వడి

చుట్టూ కొండలు.. మధ్యన సన్నని దారులు.. అడుగడుగునా జలపాతాలు... ఇలా సీతంపేట ఏజెన్సీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలపాతాలు నీటిసవ్వడితో ఆకర్షిస్తున్నాయి. మన్యంలో మెట్టుగూడ, సున్నపుగెడ్డ, మల్లమ్మగెడ్డ, బెనరాయి జలపాతాలు ఉన్నాయి. వీటిలో మెట్టుగూడ జలపాతాన్ని మాత్రమే పర్యాటకంగా అభివృద్ధి చేశారు. ఇక్కడకు పర్యాటకుల తాకిడి కూడా ఎక్కువగా ఉంటుంది. కార్తీక మాసంలో ఎక్కువగా పర్యాటకులు వస్తారు. మామూలు రోజుల్లో శని, ఆదివారాల్లో మైదాన ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికంగా వచ్చి వెళ్తుంటారు. ఇక్కడకు వెళ్లాలంటే సీతంపేట–కొత్తూరు రహదారి మధ్యలో సీతంపేటకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మెట్టుగూడ గ్రామానికి సమీపంలో ఇది ఉంది. మిగతా జలపాతాలైన సున్నపుగెడ్డ, మల్లమ్మ గెడ్డ, బెనరాయి వంటి జలపాతాలు అభివృద్ధి చేస్తే మరింత పర్యాటకులను ఆకట్టుకుంటాయి. సున్నపుగెడ్డ జలపాతానికి దోనుబాయి వెళ్లి అక్కడ నుంచి పొల్ల మార్గంలో 3 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. మల్లమ్మ జలపాతం పాలకొండ–సీతంపేట రహదారి మధ్యలో కుశిమి రోడ్డు ఉంటుంది. అక్కడ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో మల్లి గ్రామ సమీపంలో ఉంటుంది. బెన్నరాయి జలపాతంకి వెల్లాలంటే సీతంపేట నుంచి కొండాడ–పాంద్ర మీదుగా వెళ్లాలి.



సీతంపేట: మల్లమ్మగెడ్డ జలపాతం



సీతంపేట మెట్టుగూడ జలపాతం నీటితో కొండవాలులో సాగుచేస్తున్న వరి పంట



సాలూరు మండలం గంజాయి భద్రరాయపాడు వద్ద జలపాతం

సాగునీటికి ఆదరువు

సాలూరు మండలంలోని లొద్ద జలపాతం నీటిని మళ్లిస్తూ.. స్థానిక కొదమ పంచాయతీ గిరిజన గ్రామాల ప్రజలు చిన్నచిన్న మడులుగా రాళ్లతో కట్టుకుని సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు పంటలను పండిస్తున్నారు. శిఖపరువు జలపాతం నీరు నేరుగా గోముఖి నదిలో కలుస్తుంది. ఈ నది వెంగళరాయ సాగర్‌లో కలిసి.. మక్కువ, బొబ్బిలి, పార్వతీపురం మండలాల్లోని కొన్ని గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తోంది. కురుకూటి, దండిగాం జలపాతాలు సువర్ణముఖి నదిలో కలసి వెంగళరాయ సాగర్‌లోకే వెళ్తుంది. దళాయివలస వద్ద రూడి జలపాతం ఉంది. ఈ జలపాతానికి కింద మూలతాడివలస, బట్టివలస వద్ద చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి. ఈ నీరు కలవడం వల్ల సుమారు 140 ఎకరాల వరకు సాగునీరు అందుతోంది. గాలిగబడారు జలపాతం నీటిని కూడా తాడివలస వద్ద గిరిజనులు మళ్లిస్తూ.. సుమారు 50 ఎకరాల వరకు పండిస్తున్నారు.

- పాచిపెంట మండలంలోని పెద్దగెడ్డ జలాశయానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఆలూరు గ్రామానికి సమీపంలో దట్టమైన అడవి, కొండలతో పెనవేసుకునేలా ధారగెడ్డ జలపాతం ఉంది. వర్షాకాలం సమయంలో కనులకువిందుగా ఉంటుంది. పర్యాటకులు అధికంగా వస్తుంటారు. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయగలిగితే.. మరింత మందికి ఇక్కడి అందాలు అందుబాటులోకి వస్తాయి.



ఇక్కడుందీ.. బాహుబలి జలపాతం!

సాలూరు నియోజకవర్గంలోని సాలూరు, పాచిపెంట ప్రాంతాల్లో 11 వరకు జలపాతాలున్నాయి. ఇక్కడి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి, రిసార్టుల నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పెద్దగెడ్డ వద్ద బోటు షికారు ఆధునికీకరణతోపాటు, పారమ్మతల్లి కొండ, సమీప కొండలపై ఉన్న ఆలయాలను కలిపి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి అరకు వైపు వెళ్లే సందర్శకులు ఇక్కడ నుంచే నేరుగా వెళ్లేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈలోగా ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది.

- సాలూరు మండలంలోని గిరిశిఖర కొదమ పంచాయతీ లొద్ద–చింతామల మధ్య 350 నుంచి 500 అడుగుల మేర భారీ జలపాతం ఉంది. చుట్టూ వర్షం కురిసిన సందర్భంలో బాహుబలి సినిమా లోని జలపాతాన్ని తలపిస్తుంటుందని పర్యాటకులు చెబుతుంటారు. ఎటుచూసినా కొండలు, పచ్చని చీరను సింగారించుకున్నట్లుగా అడవి తల్లి, పక్షుల కిలకిలారావాలు, పెద్ద ఘోషతో జలపాతం సందడి సందర్శకులకు మంచి అనుభూతిని కలిగిస్తోందనడంలో సందేహం లేదు.

ఉపాధికి అవకాశాలు బోలెడు

మన్యంలో సహజసిద్ధ వనరులకు కొదవలేదు. వీటిని పర్యాటకంగా తీర్చిదిద్దితే... స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. పర్యాటకుల సంఖ్య పెరిగి జిల్లాకు ఆదాయం సమకూరుతుంది. స్థానికులకు వివిధ రంగాల్లో ఉపాధి కలుగుతుంది.



పాచిపెంట మండలంలో ధారగెడ్డ అందాలు

భారీ వర్షాలు.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

- కంట్రోల్ రూం ఏర్పాటు
- ఉద్యోగులకు ఆదివారం సెలవు రద్దు
- పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ తీరం దాటేవేళ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులతో కలెక్టర్ కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్‌లో శనివారం మాట్లాడారు. విపత్తుల వేళ సహాయక చర్యలు అందించేందుకు వీలుగా కలెక్టర్ కార్యాలయం -08963-293046, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. అధికారులు, సిబ్బంది సెలవులు రద్దుచేసినట్టు ప్రకటించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు దినంగా ప్రకటించారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాజెక్టుల్లో ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలతోపాటు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు బయట తిరగరాదన్నారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు ఎ.హేమలత, వీవీ రమణ, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, ఇరిగేషన్ ఈఈ ఆర్.అప్పలనాయుడు, జగదీష్, జిల్లా విపత్తుల నిర్వహణాధికారి శ్రీనుబాబు, ఆర్‌అండ్‌బీ అధికారి ఎం.జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

కీలక పోస్టులు ఖాళీ

- ఐటీడీఏకు పీఓతో సహా ఇన్‌చార్జ్‌లే దిక్కు
- అంతంతమాత్రంగా క్షేత్రస్థాయి పథకాల అమలు



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఐటీడీఏలో పీఓ స్థాయి అధికారి మొదలుకుని కీలకపోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఈ బదిలీల్లో అయినా పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ అవుతాయో? లేదోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ విభాగాల అధిపతుల పోస్టులు ఖాళీగా ఉండడంతో క్షేత్రస్థాయిలో పథకాల అమలు తూతూ మంత్రంగా నడిచిపోతున్నాయి. కొద్ది రోజుల క్రితం ఐటీడీఏ పీఓగా రాహుల్‌కుమార్‌రెడ్డిని ప్రభుత్వం నియమించి..పట్టుమని పదిహేను రోజులు కూడా కాకుండా బదిలీ చేసింది. ఇంతవరకు ఆ స్థానంలో మరో ఐఏఎస్ అధికారిని భర్తీ చేయలేదు. పాలకొండ ఆర్డీవో వి.వి.రమణ ప్రస్తుతం ఇన్‌చార్జ్ పీఓగా కొనసాగుతున్నారు.

ఖాళీలివే..

ఐటీడీఏకు డిప్యూటీ డీఎంహెచ్‌వో పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టులో ఎవరినీ నియమించలేదు. ఇక్కడ పనిచేసిన విజయపార్వతి డీఎంహెచ్‌వోగా ఉద్యోగోన్నతి పొందడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. అదనపు బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదు. ఏజెన్సీలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దోనుబాయి, కుశిమి, మర్రిపాడు పీహెచ్‌సీల పరిధిలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి కేసులు విస్తారంగా నమోదవుతున్నాయి. ఆయా పీహెచ్‌సీలను సందర్శించి కేసుల వివరాలు తెలుసుకోవడం, మందులు పూర్తిగా అందుబాటులో ఉండేలా చూడడం, అలాగే గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించేలా చర్యలు తీసుకోవడం తదితర విధులు డిప్యూటీ డీఎంహెచ్ఓ నిర్వహించాల్సి ఉంది. ప్రాజెక్టు అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. కొద్ది రోజుల కిందట ఇక్కడ పనిచేసిన హరికృష్ణ బదిలీపై వేరే జిల్లాకు వెళ్లినా ఆ పోస్టు భర్తీ కాలేదు. ఇన్‌చార్జ్‌గా గణేష్ వ్యవహరిస్తున్నారు. ఆయన వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ అయ్యేలా చూడడం, 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హుల జాబితా తయారు చేయడం, వ్యవసాయాధికారులు, అసిస్టెంట్‌లను మానిటరింగ్ చేయాల్సి ఉంది. గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ జి.సంధ్యారాణిని విశాఖ హెడ్ ఆఫీస్ జనరల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఇక్కడ ఆమె పర్యవేక్షణ నామమాత్రమేనని చెప్పవచ్చు. ఇక వెలుగులో ఏపీడీ పోస్టు కూడా ఖాళీగా ఉంది. శ్రీకాకుళం పశు సంవర్ధకశాఖ ఎ.డి సన్యాసిరావు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వెలుగు ద్వారా నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస్ కేంద్రాలు మూలుగుతూ నడుస్తున్నాయి. ఆ యూనిట్‌లు పూర్తిస్థాయిలో నిర్వహించడం లేదు. ఇక రుణాల రికవరీ, బ్యాంకు లింకేజీలు వంటివాటిపై దృష్టిసారించిన నాథులే లేరు. టీపీఎంయూ పరిధిలో 7 మండలాల్లో పర్యవేక్షణ నామమాత్రంగా ఉంది. గ్రామీణ నీటి సరఫరా విభాగంలో జేఈ పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టులో సైట్ ఇంజినీర్ పాపారావు విధులు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీలో మంచినీటి ఎద్దడిపై పూర్తి అవగాహన లేదు. వర్షాకాలంలో కూడా గెడ్డనీటిపై కొన్ని గ్రామాలు ఆధారపడి, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తికాలేదు. ఐటీడీఏ మేనేజర్, డిప్యూటీ ఈవో వంటి కీలక పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. మరి ఈ పోస్టులన్నీ ఎప్పటికి భర్తీ అవుతాయో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

మారిషస్ పైనాపిల్ మొక్కల సరఫరాకు టెండర్లు



సీల్డు టెండర్లు ఓపెన్ చేస్తున్న అధికారులు

సీతంపేట: మారిషస్ పైనాపిల్ మొక్కల సరఫరాకు ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం టెండర్లు ఖరారు చేశారు. ఇన్‌చార్జ్ పీఓ వి.వి.రమణ ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియ నిర్వహించగా 11 మంది టెండర్‌దారులు పాల్గొన్నారు. సీతంపేట, భామిని మండలాల్లో మొత్తం 110 ఎకరాల్లో ఈ పైనాపిల్ మొక్కలను రైతులకు సరఫరా చేయనున్నారు. నాణ్యమైన మొక్కలు సరఫరా చేయాలని ఇన్‌చార్జ్ పీఓ తెలిపారు. కార్యక్రమంలో రస్తాకుంటుంబాయి కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, స్థానిక శాస్త్రవేత్తలు జ్యోతిబసు, లక్ష్మీనారాయణ, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, హెచ్‌వోలు జయంతి, జయశ్రీ, ఏటీడబ్ల్యూవో మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలోని యాగశాలలో సుందరకాండ పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు శనివారం వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకొని యాగశాలలో రామాయణ పట్టాభిషేక సర్గ హవనం జరిపించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం వెండి మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద స్వామి నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు నరిసింహాచార్యులు, సాయిరామాచార్యులు, వరప్రసాద్, రామగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీకి ఘన వీడ్కోలు



అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్‌కు సన్మానిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో పని చేసిన అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్ సీఐడీ విభాగానికి బదిలీ కావడం, అదే విధంగా ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, సీసీఎస్ ఎస్ఐ గొల్లు పోలినాయుడు, చీపురుపల్లి ఏఎస్ఐ కోల అడివన్నలకు ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందల్ దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, ఎస్‌బీ సీఐలు కెకెవి.వి జయనాథ్, తదితరులు పాల్గొన్నారు.

భోగారావుకు గిడుగు పురస్కారం



జాతీయ స్థాయి జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న పప్పు భోగారావు

విజయనగరం టౌన్: తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని గిడుగు రామూర్తి ఫౌండేషన్ జాతీయ స్థాయిలో ప్రధానం చేస్తున్న గిడుగు పురస్కారాలలో కళా రంగంలో చేసిన సేవలకుగానూ విజయనగరానికి చెందిన పప్పు భోగారావుకు జాతీయ స్థాయి జీవన సాఫల్య పురస్కారం లభించింది. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటనలోకీ విషయం తెలిపారు. విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన భాషా దినోత్సవ వేడుకల్లో ఫౌండేషన్ నిర్వాహకులు, ముఖ్య అతిథుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నామన్నారు. ఈ మేరకు విజయనగరంలో సహజ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎన్‌కె.బాబు, నాలుగెస్సుల రాజు, సాహిత్య అభిమానులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత ప్రయాణం ఉత్తిదేనా..!

ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్టు కూటమి నేతల తీరు ఉందని మహిళలు పెదవి విరిస్తున్నారు. ఎన్నికల సమయంలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ఏ ఒక్క హామీపైనా మూడు నెలలవుతున్నా... ఎటువంటి కసరత్తు జరగకపోవడంతో ఓట్లేసి మోసపోయామని నేతల తీరును విమర్శిస్తున్నారు.

- ఎన్నికల వేళ ఉత్తుత్తి హామీలు
- అధికారం చేపట్టి మూడు నెలలవుతున్నా అతీగతి లేదు..
- సూపర్ సిక్స్‌ను నమ్మి ఓట్లేసిన అక్కచెల్లెమ్మలు
- ఏ ఒక్క హామీ అమలు కాకపోవడంతో పెదవి విరుపు



పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల పాట్లు

పాలకొండ రూరల్: రాష్ట్రంలో కొద్ది నెలల కిందట సాధారణ ఎన్నికల వేళ ఎన్‌డీఏ కూటమి నేతలు సూపర్ సిక్స్ పేరిట ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసి ఊదరగొట్టారు. అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని గొప్పలకు పోయారు. సూపర్ సిక్స్‌పై విస్తృత ప్రచారం చేసి మహిళా ఓటర్లను ఆకట్టుకున్నారు. వీటిని నమ్మి మహిళలు ఓట్లేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి మూడు నెలలవుతున్నా... మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ పట్టాలెక్కకపోవడంతో నమ్మి మోసపోయామని దుయ్యబడుతున్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఉత్తిదేనా... అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో...

నూతనంగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో ఏజెన్సీ ఛాయలు కలబోసి ఉన్నాయి. ఈ ప్రాంత మహిళల్లో అధికులు కాయకష్టంపై ఆధారపడుతుంటారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణమంటే నమ్మారు. నాలుగింట మూడు టీడీపీ, ఒక నియోజకవర్గంలో జనసేనకు పట్టం కట్టారు. వీరి గెలుపులో మహిళా ఓటర్లే కీలకం కావటం విశేషం. తాజా ఎన్నికల లెక్కల ప్రకారం జిల్లాలో 7,83,440 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 3,82,589, స్త్రీలు 4,00,779 మంది అంటే పురుషులతో పోల్చుకుంటే మహిళలు 18,190 మంది అధికం. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఇదే లెక్క. ఈ క్రమంలో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని హామీలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టారు. జిల్లాలో సాలూరు ఆర్టీసీ డిపో పరిధిలో 40, పాలకొండ డిపో ద్వారా 66, పార్వతీపురం డిపో నుంచి 76 బస్సులు సేవలు అందిస్తున్నాయి. వీటికి తోడుగా హైర్ బస్సులు 102 ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో 75 శాతం రూట్లు గ్రామీణ ప్రాంతాలకు సేవలుందిస్తుండగా నిత్య ప్రయాణికుల్లో 33 శాతం మంది మహిళా ప్రయాణికులు జిల్లా పరిధిలో 15 మండలాల్లో రాకపోకలు సాగిస్తుండటం విశేషం. సగటున రోజుకు ఈ మూడు డిపోల నుంచి రూ.25 లక్షల మేర ఆదాయం వస్తున్నట్టు సంబంధిత యూనియన్ నాయకులు చెబుతున్నారు. ఆర్టీసీ ఉచిత సర్వీసులు నడిపితే వారిపై కొంత మేర ఆర్థిక భారం తగ్గుతుంది.

సోషల్ మీడియాలో..

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబుతో పాటు సంబంధిత శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి కూడా త్వరలోనే అని చెప్పడమే తప్పితే స్పష్టత ఇవ్వటం లేదు. ఇటీవల సోషల్ మీడియాలో ఆగస్టు 15 నుంచి అనే వదంతులు హల్‌చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఆ రోజు కూడా మహిళలకు నిరాశే మిగిల్చింది. సూపర్ సిక్స్ హామీలైతే ఇచ్చాం... కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తోందని సీఎం పేర్కొనడంతో మహిళల అనుమానాలకు మరింత బలం చేకూర్చుతుంది. ఈ ఏడాది ఉచిత ప్రయాణం ఉత్తిదేనా అన్న చర్చ జరుగుతుంది.

సమాధానం చెప్పాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు పట్టాలెక్కలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు హామీలు అమలు చేశాయి. ఏజెన్సీలో గిరిజన మహిళలు తమ రెక్కల కష్టంపై ఆధారపడతారు. వారు పండించిన పంటల విక్రయాలకు ప్రయాణాలు చేస్తారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తే వారికి కొంత మేర ఊరట కలుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

– విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే

గ్రామీణ మహిళలే అధికం



జిల్లాలో అధిక సంఖ్యలో మహిళలు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వారికి ఎంతో మేలు చేకూర్చుతుంది. హామీ ఇచ్చేటప్పుడే ఆచరణకు సాధ్యమా! అసాధ్యమా! అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి సీఎం పీఠంపై కూర్చొని ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తోందని అంటే ఎలా..ఉచిత బస్సు ప్రయాణం తక్షణమే అమలు చేయాలి.

– వి.విమల, జిల్లా గ్రామిక మహిళ సంఘం అధ్యక్షురాలు, పార్వతీపురం

హామీ అమలు చేయరా..



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు మాట తప్పుతున్నారు. హామీల అమలుకు కనీసం కసరత్తు చేసినట్టు కనిపించడం లేదు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం భ్రమగానే అనిపిస్తుంది. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

– బి.పుష్ప, గృహిణి, పాలకొండ

ప్రజా ప్రయోజన పనులు గుర్తించండి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు గుర్తించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టిన పనులపై పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులు, ప్రస్తుత పరిస్థితిపై శనివారం సమీక్షించారు. గిరిశిఖర గ్రామాలకు, మారుమూల గ్రామాలకు రోడ్లు అనుసంధానత కలిగే విధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగు పనులను పూర్తి చేసేందుకు రానున్న 15 రోజులకు సంబంధించి ప్రణాళిక అందజేయాలని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీకూడదని, చేసిన నిర్మాణ పనులు పటిష్టంగా ఉండాలన్నారు. నిర్మాణ పనులను రెండు, మూడు స్థాయిలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. 80 శాతానికి పైగా పూర్తయిన పనులను మొదటగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గిరిజన గ్రామాలలో అంతర్గత రహదార్లు, కాలువలు, రక్షిత గోడలు నిర్మాణ పనులను గుర్తించాలని తెలిపారు. ఇంజనీర్లు వారి పరిధిలోని ప్రతి గ్రామాన్ని సందర్శించాలని, ప్రతి గ్రామంలో చేపట్టవలసిన పనులు గుర్తించి ముందుగానే అంచనా వ్యయాలు సిద్ధం చేసుకోవాలన్నారు. మంజూరైన పనులకు సంబంధించి పనులు చేపట్టని కాంట్రాక్టర్లను తొలగించి కొత్తవారికి పనులు కేటాయించి పూర్తి చేయాలని తెలిపారు. వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఆమోదించిన 10 కి.మీ. సీసీ రోడ్లు, 10 కి.మీ సీసీ కాలువలు నిర్మాణ పనులు పూర్తి చేయాలని తెలిపారు. మంచినీటి సరఫరా పనులే కాకుండా బోర్లలో నీరు తగ్గిపోకుండా నీటి మట్టం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు సంబంధించిన వివరాలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు తెలియజేస్తూ ఈ సంవత్సరానికి కోటి నలభై లక్షల పనిదినాలు, రూ.241కోట్ల పనులు కేటాయించడం జరిగిందని తెలిపారు. రూ.142 కోట్ల విలువ చేసే 462 పనులకు శాఖాపరమైన ఆమోదం లభించిందని, రూ.70 కోట్ల పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని, రూ.6.09 కోట్ల బిల్లులు చెల్లించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, పీఆర్ ఈఈ డా.ఎంవీఆర్ కృష్ణాజీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదానికి గురైన లారీ

పాచిపెంట: మండలంలోని పి.కొనవలస జాతీయ రహదారి, ఘాట్‌రోడ్డుపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఏఎస్ఐ ముసలయ్య శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ నుంచి పశువుల దాణా లోడుతో కాకినాడ వెళ్తున్న ఓ లారీ, మండలంలోని కర్రివలస పంచాయతీ కంకణపల్లి జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న మరో లారీని అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పశువుల దాణా లోడు లారీ డ్రైవర్ చౌటిపల్లి తాతారావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడు కుమారుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

జామి: అలమండ – కంటకాపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు శనివారం తెలిపారు. మెరూన్ కలర్ టీషర్ట్, బ్లూ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. రైల్లోంచి జారిపడి మృతిచెందినట్లు తెలుస్తోందని, పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసినవారు 94906 17089 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

6న మిగులు యూజీ సీట్లకు ఓపెన్ కౌన్సెలింగ్

- గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి



ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, వీసీ, గిరిజన వర్సిటీ

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 2024–25 విద్యాసంవత్సర ప్రవేశానికి అందిస్తున్న వివిధ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 6న ఓపెన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందగోరే అభ్యర్థులు ఎన్‌టీఏ నిర్వహించిన సీయూఈటీ (యూజీ) పరీక్ష రాసిన వారై ఉండాలన్నారు. కౌన్సెలింగ్ హాజరయ్యే అభ్యర్థులు 'సీఈయూఏపీ.ఏసీ.ఐఎన్' వెబ్ సైట్‌లో తమ పేర్లను ఈ నెల 5వ తేదీ రాత్రి 11.55 గంటలలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలను యూనివర్సిటీ క్యాంపస్ హెల్ప్‌డెస్క్ లేదా ఫోన్ నంబర్ 08992296033ను సంప్రదించాలని సూచించారు. నాలుగు సంవత్సరాల నిడివికల రీసెర్చ్‌తో కూడిన బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ జియాలజీ, బీఎస్సీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యూజీ కోర్సుల్లో మిగులు సీట్లకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

మృతుడు పెదబంటుపల్లి వాసి

- ఐఎంఈఐ నంబర్ ఆధారంగా అడ్రస్ గుర్తింపు
- తాపీ పని చేస్తూ జీవనం
- పోస్టుమార్టం అనంతరం మృతిపై నిర్ధారణ



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మజ్జి లక్షుంనాయుడు

చీపురుపల్లి: అనుమానాస్పద స్థితిలో ఉన్న మృతదేహం ఆచూకీ లభించింది. వారం రోజులుగా ఎవరికీ తెలియకుండా జంతువులు పీక్కు తినే స్థితిలో ఉన్న మృతదేహం ఎవరనేది పోలీసులు కనుగొన్నారు. మండలంలోని రేగిడిపేట పరిసరాల్లో శుక్రవారం లభించిన మృతదేహానికి సంబంధించి గుర్ల మండలంలోని పెదబంటుపల్లి గ్రామానికి చెందిన మజ్జి లక్షుంనాయుడు(35)గా గుర్తించినట్లు ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. మృతుడి ముఖం, కాళ్లు, చేతులు జంతువులు పీక్కు తినడంతో గుర్తు పట్టలేని స్థితిలో మృతదేహం ఉన్న సంగతి తెలిసిందే. అయితే మృతుని ఫ్యాంట్ జేబులో ఉన్న మొబైల్‌లోని ఐఎంఈఐ నంబర్ ఆధారంగా ఆయన అడ్రస్సు సేకరించారు. పెదబంటుపల్లి గ్రామానికి చెందిన లక్షుంనాయుడు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉండగా భార్య ఐదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో పిల్లలు ఇద్దరూ విజయవాడలోని పెద్దమ్మ ఇంటిలో ఉంటున్నారు. మృతుడు లక్షుంనాయుడు తాపీ పని చేసుకుంటూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవాడు. అందులో భాగంగానే వారం క్రితం వెళ్లిన లక్షుంనాయుడు తిరిగి రాలేదు. లక్షుంనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతి వెనుక కారణాలపై నిర్ధారణకు రావాల్సి ఉంటుందని ఎస్ఐ తెలిపారు. తండ్రి రామప్పుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

యువకుడి మృతిపై అనుమానాలు


- పోలీస్‌స్టేషన్ వద్ద తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి తల్లిదండ్రులు, బంధువులు

కొత్తవలస : మండలంలోని కొత్తూరుగొప్ప గ్రామ సమీపంలో ఆగస్టు 25న అదే గ్రామానికి చెందిన డి.రాధాకృష్ణ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. కాగా రాధాకృష్ణ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ ఆయన తల్లిదండ్రులు అప్పలరాజు, అరుణతో పాటు బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం ఆందోళనకు దిగారు. రాధాకృష్ణ మృతిపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని నినాదాలు చేశారు. ఆగస్టు 9న ఇంటి నుంచి వెళ్లిన రాధాకృష్ణ 10వ తేదీన తమ్ముడు పుట్టిన రోజు సందర్భంగా ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపాడని తరువాత ఆచూకీ లేకుండా పోయిందని సీఐకి వివరించారు. ఆగస్టు 25న గ్రామానికి సమీపంలో గల మామిడి తోటలో చెట్టుకు శవమై వేలాడుతూ కనిపించాడని విలపించారు. తమకున్న అనుమానాలను సీఐ షణ్ముఖరావుకు వివరించారు. దీనిపై స్పందించిన సీఐ మాట్లాడుతూ మృతుడి సెల్‌ఫోన్ కాల్‌లిస్టును పరిశీలిస్తున్నామని, పోస్టుమార్టం రిపోర్టు రావాల్సి ఉందన్నారు. మృతిపై అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల సత్తా



బంగారు, వెండి పతకాలతో విద్యార్థి రమాదేవి, కోచ్ అర్జున్

నెల్లిమర్ల రూరల్: అనకాపల్లిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలం టెక్కలి సెంచూరియన్ వర్సిటీ విద్యార్థులు సత్తా చాటారు. సబ్ జూనియర్ విభాగంలో రమాదేవి బంగారు పతకం, జూనియర్ విభాగంలో వెండి పతకాన్ని సాధించింది. సీనియర్ విభాగంలో శ్రీలక్ష్మి బంగారు పతకం కైవసం చేసుకొంది. మరో విద్యార్థి శ్రీపాద శ్రీజ తెలంగాణలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, వెండి పతకాలను సాధించింది. పతకాలు సాధించిన విద్యార్థులకు వర్సిటీ వీసీ పీకే మహంతి, సిబ్బంది అభినందలు తెలిపారు.

ఎయిర్‌పోర్టుకు మౌలిక వసతుల కల్పన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. విమానాశ్రయానికి వసతుల కల్పన, భూ సేకరణ తదితర అంశాలపై తన చాంబర్‌లో కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఎయిర్‌పోర్టుకు నీటిని అందించేందుకు సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన పనులపై ఆరా తీశారు. వీలైనంత వేగంగా పూర్తి చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుమారు 25 కిలోమీటర్ల మేర నాలుగు కెనాల్స్‌ను తవ్వాల్సి ఉందన్నారు. దీనికి అంచనాలను త్వరగా తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, ఇరిగేషన్ ఈఈ సీతారాం, ఇతర శాఖల అధికారులు, జీఎంఆర్ సీఈఓ మనోమేరాయ్, సీడీఓ ఎం.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹111	₹192	₹202

హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ



కోట ప్రాంతంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

విజయనగరం క్రైమ్: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, రోడ్డు ప్రమాదాలలో ప్రాణాపాయం నుంచి రక్షణ పొంది సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవాలని వాహనదారులకు ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మెసానిక్ టెంపుల్ వద్ద నిర్వహించిన హెల్మెట్ అవగాహన ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఇంటి నుంచి బయటకు వస్తే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలు వీధిన పడకూడదన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి రక్షణ పొంది, ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీలు గోవిందరావు, యూనివర్స్, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, వన్‌టౌన్, టూటౌన్, భోగాపురం, మహిళా పీఎస్ సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ

- 6వ తేదీలోపు గిరిజనుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: డీఎస్సీ పోటీ పరీక్ష ఉచిత శిక్షణకు గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత జిల్లా అధికారి రామానందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించి పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. బీఈడీ/డీఈడీ అభ్యర్థులు టెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత పరీక్షలో ప్రతిభ ఆధారంగా 100 మందిని ఎంపిక చేస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సంబంధిత విద్యార్హత, కుల ధ్రువీకరణపత్రాలు, రేషన్ కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌ఫొటోలను ఈ నెల 6వ తేదీలోగా కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయానికి అందజేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్: 8374821431, 82478 52338 నంబర్లను సంప్రదించాలన్నారు.